ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 5 డిసెంబరు 2025
www.prajaswaramdaily.com
1 pm

రాజీనామాకు వెనుకాడను

నాకు ఎన్నికలు కొత్త కాదు..

ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్: ప్రజాస్వరం

నాకు ఎన్నికలు కొత్త కాదు.. ఇప్పటికి 11 సార్లు కొట్లాడిన చరిత్ర ఉంది. అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. నా వాదనలు వినిపిస్తాను అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వెల్లడించారు. ఎన్నికల్లో ఫైట్ చేయడం, గెలవడం తన రక్తంలోనే ఉందని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌నగర్, నారాయణగూడలో రూ.1.40కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అనర్హత వేటు అంశంపై దానం స్పందించారు. రాజీనామా ప్రస్తావన ఇంకా రాలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నాను. రేవంత్‌రెడ్డి మరో పదేళ్లు సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. . రైజింగ్ తెలంగాణ కోసం తలపెట్టిన గ్లోబల్ సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుందని దానం నాగేందర్ అన్నారు.

ఆర్బీఐ తీపికబురు

25 బేసిస్ పాయింట్ల వడ్డీ తగ్గింపు

యుంబయి,ప్రజాస్వరం

కీలక వడ్డీ రేట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గుడ్ న్యూస్ చెప్పింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ)లో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. తాజా తగ్గింపుతో రెపో రేటు 5.25 శాతానికి చేరింది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఫలితంగా ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపో రేటు 1.25శాతం వరకు దిగొచ్చింది.

ఇండిగో విమానాల రద్దుపై ప్రయాణికుల ఆందోళన

హైదరాబాద్, ప్రజాస్వరం

శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇండిగో విమానాల మొత్తం 92 విమానాలు రద్దు చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇందులో శంషాబాద్‌కు రావాల్సినవి 43, ఇక్కడి నుంచి వెళ్లాల్సినవి 49 ఉన్నాయి. ముందుగా బుక్ చేసుకున్న సర్వీసుల రద్దుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్‌ఇన్ అయిన తర్వాత రద్దు సమాచారం ఇవ్వడంపై నిరసన తెలిపారు. మరోవైపు విశాఖ నుంచి 8 ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేశారు. వీటిలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్‌కు వెళ్లాల్సినవి ఉన్నాయి.

దిద్దుబాటు చర్యలకు దిగిన ఇండిగో

నిర్వహణపరమైన లోపాల వల్ల దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు ఆటంకం కలగడంతో ప్రయాణికులకు పడిగాపులు తప్పలేదు. దిద్దుబాటు చర్యలకు దిగిన ఇండిగో.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)ను ఆశ్రయించింది. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనల నుంచి ఎయిర్‌బస్ ఏ320 విమానాలకు మినహాయింపు కల్పించాలని ఎయిర్‌లైన్ కోరింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 10 వరకు ఈ ఉపశమనం ఇవ్వాలని ఇండిగో కోరినట్లు డీజీసీఏ తమ ప్రకటనలో వెల్లడించింది.

400 విమాన సర్వీసుల రద్దు

శుక్రవారం మరో 400కు పైగా విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేసింది. సగానికి పైగా ఒక్క ఢిల్లీ విమానాశ్రయంలోనే రద్దవడం గమనార్హం.
ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 220కి పైగా ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. బెంగళూరులో 100కి పైగా.. హైదరాబాద్ విమానాశ్రయంలో 90కి పైగా విమాన సర్వీసులను ఎయిర్‌లైన్ రద్దు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

గుండెపోటుతో సర్పంచ్ అభ్యర్థి మృతి

రాజన్న సిరిసిల్ల, ప్రజాస్వరం :

రాజన్న సిరిసిల్ల జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సర్పంచ్ బరిలో నిలిచిన ఓ అభ్యర్థి, గెలుపు ముంగిట గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. వేములవాడ అర్బన్ మండలం, చింతల్‌ఠానా గ్రామంలో ఈ ఘటన జరిగింది. చింతల్‌ఠానా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో చెర్ల మురళి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కోసం పలు ప్రణాళికలతో ఆయన ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే, గురువారం ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సర్పంచ్‌గా గెలిచి గ్రామస్థులకు సేవ చేయాలన్న తన కల నెరవేరకుండానే ఆయన అర్ధాంతరంగా తనువు చాలించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చదువులో వెనుకబడ్డాననే ..

బి.టెక్ విద్యార్థి ఆత్మహత్య

హుజూరాబాద్ లో ఘటన

కరీంనగర్, ప్రజాస్వరం

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ లో బి.టెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సింగపూర్ కిట్స్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. అభినయ్ సుధన్ ఇంట్లో ఉరి వేసుకొని సూసైడ్ చేసుకున్నాడు. చదువులో వెనుకబడ్డానన్న మానసిక ఒత్తిడితో.. ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రపతి భవన్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్

ఘన స్వాగతం పలికిన ముర్ము, ప్రధాని మోదీ

ఢిల్లీ, ప్రజాస్వరం : రష్యా అధ్యక్షుడు పుతిన్ రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. ఆయనకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ఘన స్వాగతం పలికారు. అనంతరం పుతిన్ సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయన భారత్ పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా వాణిజ్యం, రక్షణ రంగాలతోపాటు పలు కీలక ఒప్పందాలను కుదుర్చుకోనున్నారు. భేటీ అనంతరం మధ్యాహ్నం సమయంలో ఇరు దేశాధినేతలు సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొననున్నారు.

రాష్ట్రపతి భవన్ నుంచి పుతిన్ నేరుగా రాజ్‌ఘాట్‌కు చేరుకున్నారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. అక్కడి సందర్శకుల పుస్తకంలో సందేశం రాశారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌కు బయల్దేరారు. అక్కడ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తో పుతిన్ భేటీ కానున్నారు.

ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపు

హైదరాబాద్, ప్రజాస్వరం

శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ హైదరాబాద్, ప్రజాస్వరం : దుబాయ్ నుంచి వస్తున్న హైదరాబాద్ కు వస్తున్న ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపు వచ్చాయి. విమానాన్ని పేల్చేస్తామంటూ ఆగంతకులు మెయిల్ చేశారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు.

హిల్ట్ పై హైకోర్టులో కేఏ పాల్ పిటిషన్

హైదరాబాద్, ప్రజాస్వరం

హిల్ట్ పాలసీపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన 9,292 ఎకరాల భూ కేటాయింపు నిబంధనలకు విరుద్ధమని అందులో పేర్కొన్నారు. దీనిపై సీబీఐ లేదా ఈడీతో దర్యాప్తు చేయించాలన్నారు. ఇప్పటివరకు ఉన్న రికార్డులను సీజ్ చేసి ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని కోరారు.

ఎప్పటిలాగానే సాధారణ పౌరులే మూల్యం

ప్రభుత్వ గుత్తాధిపత్యమే కారణం..

ఇండిగో విమాన సర్వీసులపై

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

ఢిల్లీ, ప్రజాస్వరం :

ప్రభుత్వ గుత్తాధిపత్యమే దీనికి ప్రధాన కారణమంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు. శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రభుత్వ గుత్తాధిపత్యమే ఇండిగో విమానాల రద్దు, ఆలస్యాలకు ప్రధాన కారణాలన్నారు. ఎప్పటిలాగానే ఈ నిస్సహాయతకు సాధారణ పౌరులే మూల్యం చెల్లిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఇలాంటివి మరోసారి జరగకుండా ఉండేందుకు విమానయాన రంగంతో సహా అన్నింట్లోనూ న్యాయమైన పోటీ ఉండాలని పిలుపునిచ్చారు. మ్యాచ్‌ఫిక్సింగ్, గుత్తాధిపత్యాలు కాదంటూ మండిపడ్డారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. శివసేన యూబీటీ ఎంపీ ప్రియాంక చతుర్వేది రాజ్యసభలో పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు నోటీసులు ఇచ్చారు.

శబరిమలలో తెలుగు భక్తులపై స్థానిక వ్యాపారుల దాడి..!

తిరువనంతపురం, ప్రజాస్వరం :

శబరిమలలో తెలుగు భక్తులపై స్థానిక వ్యాపారుల దాడికి పాల్పడ్డాడు. వాటర్ బాటిల్ ధర ఎక్కువగా ఉందని అడిగినందుకు తెలుగు భక్తుడి పై దాడి చేసిన షాపు యజమాని దాడి చేశాడు. షాపు ఎదుట తెలుగు రాష్ట్రాలకు చెందిన అయ్యప్ప భక్తుల నిరసన నిర్వహిస్తున్నారు.